# హింస

జొంపని రామమోహనరావు




ఇంత పెద్ద నగరంలో ప్రతి దినమూ ఎన్నో కొట్లాటలు, దోపిడీలూ, అలజడులు, హత్యలు జరుగుతూనే వుంటాయి. కాని, నేను చెప్పబోయే సంఘటన వీటన్నిటికి అతీతమైంది. మనుషుల్లోని మానవత్వాన్ని సవాల్‌చేసే సన్నివేశం. ఆ రోజు జీవితంలో నా కెప్పుడూ మరపురాదేమో। ఆ సంఘటన బ్రతికి నన్నాళ్లూ నన్ను వెంటాడుతూనే ఉంటుందేమో!

ఆ నాడు హోటల్‌నుండి బయటకు వచ్చాను. సిగరెట్ ముట్టించుకున్న పిదప

## జోకాభి రామాయణం

అర్జంటుగా రైలుకు వెళుతున్న ఒక ఆసామి ఒక క్రాఫింగు షాపువానితో : ఓయి. నాకు క్రాపు, మెయిల్‌లా చెయ్యాలి. టైమ్ అయిపో తూంది.

క్రాఫింగు షాపువాడు : అయిపోయింది సార్. ఒక సారి అద్దం చూసుకోండి.

ఆసామి : ఇదేమిటోయి. అక్కడక్కడ వదిలేసేవు.

క్రాఫింగు షాపువాడు : అవును సార్. మెయిల్ అక్కడక్కడ ఆగుతుందిగాని అన్ని స్టేషన్లలోను ఆగదుగా.

దాగంటి కొండలరావు, విజయనగరం

★

ఒరేయ్ బుజ్జీ! రాత్రి మీ అమ్మ ప్రసవించింది. ఇవాళ బళ్ళోకి వెళ్ళవద్దులే! మీ మాస్టారడిగితే నీకు ఒక తమ్ముడు, ఒక చెల్లెలు పుట్టారని చెప్పు— అన్నాడు తండ్రి.

అది కాదు నాన్నా: యివాళ బడి మానేసి మాస్టారితో నాకొక తమ్ముడు పుట్టాడని చెప్తాను. ఎల్లుండి కూడా మానేసి, నాకొక చెల్లెలు పుట్టిందని చెప్తాను— అన్నాడు బుజ్జి కాస్సేపాలోచించి.

★

అతడు : స్వామీజీ! మీరు మౌనవ్రతం పాటిస్తున్నారుగదా! యింకా ఎన్నాళ్ళు సాగించదలచుకున్నారా వ్రతాన్ని?

స్వామీజీ : మూర్ఖుడా! నన్ను మాట్లాడించవద్దని బయట బోర్డు ఉంది. చూడలేదా?

కోనే హరిబాబు, ఏలూరు

★

రంగారావు అనువుగాని వేళలో ఆస్పత్రిలో ఉన్న భార్యను చూటానికి వెళ్ళాడు.

"ఇప్పుడు వీల్లేదు. సాయంత్రం రండి" అంది నర్సు.

"ఆవిడకు అవసరమైన కొన్ని వస్తువులు తెచ్చాను."

"నాకివ్వండి. నేనిస్తాను."

"ఆ వస్తువులలో నేనుకూడా ఉన్నాను."

బద్దిగం పాండురంగారెడ్డి, బెంగుళూరు—11

★

సాంబుడు, సీనూ నాటకానికి పోయి వస్తున్నారు.

"ఏరా సీనూ... ఎట్లా వుందీ?"

"ఏదీ... అటు ఎడమ వరసలో చివర కూర్చున్న పిల్లా లేక మూడో వరుసలో పద హారో అమ్మాయా... నువ్వనేది?

టి. శ్రీనివాసరావు, గుంటూరు.

## హింస

నా చూపు ఎదురుగా వేపచెట్టు క్రింద నిల్చున్న ఇద్దరు వ్యక్తులపై పడింది. వాళ్ళిద్దరూ కాయకష్టం చేసి బ్రతికే వాళ్ళలానే ఉన్నారుగానీ పుష్టిగా లేరు. బలిష్ఠంగా లేరు. బక్కచిక్కిన అస్థిపంజరాలు. ధూళిధూసరమైన దేహం. అతి జీర్ణవస్త్రాలు. పెరిగిన గడ్డాలు. ముగ్గు బుట్టల్లాంటి తలలు. భుజాలకు సంచులు. కాంతిలేని గాజుకళ్ళలో తొంగిచూసే ఆశ!

వాళ్ళు శ్రామికులు. వాళ్ళ శ్రమ ప్రతిఫలంపైన బతికే నాలాంటివాళ్ళు షడ్రుచులతో కూడిన పంచభక్ష్యాలను భుజిస్తారు. కాని, వాళ్ళకు త్రాగడానికి గుక్కెడు గంజికి కూడా కరువే! సానుభూతిగా వాళ్ళవైపు చూశాను.

వాళ్ళలో ఒకడు మెల్లగా వేపచెట్టెక్కసాగాడు. రెండవవాడు క్రింద నిల్చొని పైకి చూస్తున్నాడు. అప్రయత్నంగా నా చూపు చెట్టు పైకి వెళ్ళింది. అది మహా వృక్షం. దానిమీద అల్లిబిల్లిగా అల్లిన పక్షుల గూళ్ళు తప్ప నాకేమీ కన్పించలేదు. మరి వాడాచెట్టు నెందుకు ఎక్కుతున్నట్లు? వేపకాయలు తినేవికూడాకావే. వాళ్ళ చర్య చూడాలని నాకు కుతూహలం కలిగింది. సిగరెట్ పీల్చుతూ నిలబడ్డాను.

వాడు చెట్టెక్కాడు. ఒక పక్షి గూటి దగ్గరకెళ్ళి, ఆ గూట్లో చెయ్యిపెట్టి, ఒక పక్షిపిల్లనుతీసి, క్రిందకు విసిరేశాడు. అది కాకిపిల్ల. ఇంకా ఎగిరే వయస్సు రాలేదు దానికి. "కావుకావు" మని ఆర్తనాదం చేస్తుందది. క్రింద నున్నవాడు దాన్ని పట్టుకున్నాడు. అది విలవిలా తన్నుకుంటూ హృదయవిదారకంగా రోదిస్తూంది. నా గుండెల్నెవరో పిండినట్లయింది. జాలిగా ఆ పక్షిపిల్లవైపు చూశాను. వాడు దాని ముక్కుకు దారంకట్టి సంచిలో వేసుకున్నాడు.

ఆ కాకిపిల్ల కాగతి పట్టగానే మిగిలిన కాకులన్నీ మేల్కొన్నాయి. అన్నీ పెద్దగా భయంకరంగా ఘోషిల్ల సాగాయి. క్షణం క్రితం ప్రశాంతంగాఉన్న ఆ ప్రాంతమంతా భీకర వాతావరణంతో గగ్గోలై పోయింది. అసలే అది మెయిన్‌రోడ్డు; పైగా సెంటరు. కావటంవల్ల కొందరా చెట్టుచుట్టూ గుమిగూడసాగారు.

ఆ యిద్దరూ యిదేమీ పట్టించుకోవటం లేదు. వాళ్ళ పనిలోవాళ్ళు మునిగిపోయారు. పైనున్నవాడు ఇంకొక కాకిపిల్లను క్రిందికి విసిరాడు. అది క్రిందపడి కావుకావుమని అరుస్తూ కొట్టుకులాడ సాగింది. చూసే వాళ్ళ కడుపు చుమ్మలు వారేలా రోదిస్తుంది. అక్కడి వాళ్ళందరి మొహాల్లోనూ వాళ్ళమీద అసహ్యం కనిపించింది. పక్షిపిల్లలపై జాలీ, వాళ్ళమీద కోపమూ అనులోమానుపాతంలో పెరగసాగాయి. జనమంతా తమలో తాము వాళ్ళను తిట్టుకుంటున్నారు.

"ఒరే పావురాయి పిల్లలు దొరుకుతాయేమో సూడు" అన్నాడు క్రిందివాడా పక్షినికూడా సంచిలో వేసుకుని.

"ఎయ్యో! ఓటిలేరా, పావురాయే కావాలేటి? కడుపు మాడతంటేను?" అంటూ వేరొక కొమ్మమీదికి మారాడు చెట్టుపైవాడు.

అంతలో ఆ గుంపులోనుండి ఒక పెద్దమనిషి వాళ్ళపాలిటి యముడిలా వచ్చాడు "ఒరే ఎవర్రా మీరు?" గద్దించాడాయన.

"మేం కూలిపని సెయ్యనేవాల్లం బాబయ్యా" సవినయంగా సమాధానమిచ్చాడు వాడు.

"ఈ కాకిపిల్లల్ని ఎందుకురా చంపుతావ్?" వాడి చెవి పట్టుకున్నాడాయన. వాడు వణికిపోసాగాడు.

"తినడానికి బాబుగారూ!"

"వీటిని తినకపోతే చావరాదురా? లంజ కొడకా. నోరులేని పసికూనల్ని చంపుతావురా" అంటూ బలంగా కొట్టాడాయన.

"బాబుగారూ! నన్ను కొట్టకండి .... మూడురోజుల్నుంచి తిండిలేదు బాబూ! మీకు మొక్కుతానండోయ్!" అంటూ వాడు రెండుచేతులు మొగిడ్చి మొక్కాడు.

"తన్నండి దొంగవెధవని".

"దొంగ ఏడ్పులండీ ఇవన్నీ".

"నోరులేని జీవాల్ని హింసించడమే!".

ప్రజలంతా వాడ్ని అసహ్యంగా చూస్తున్నారు. అందరూ ఒక్కసారిగా తమ కోపాన్ని వెళ్ళగ్రక్కారు. అంతమంది కోపానికీ ఎరయాడా అమాయకుడు.

"నాయనో....సచ్చినా బాబో! కొట్టకండయ్యలారా! మీ కాళ్ళట్టుకుంటానండో!" కేకలు పెడ్తున్నాడు వాడు. అక్కడ కూడిన వాళ్ళంతా వాణ్ణి కొడ్తూ, తంతూ వాణ్ణి నలిపివేస్తున్నారు. నా హృదయం బాధగా మూలిగింది. అసహాయుడైన ఆ అల్పజీవి ఆర్తనాదాలు నన్ను దహించివేస్తున్నాయి. కాని, ఆ జనాన్నందర్నీ నేను సమాధానపరచ యత్నించి విఫలుడనయ్యాను.

చెట్టుపైన వున్నవాడు వణికిపోతున్నాడు. తన మిత్రుని పరిస్థితికి కన్నీరు కారుస్తున్నాడు.

"దిగిరారావెధవా"అన్నాడా పెద్దమనిషి. వాడు వణకిపోతున్నాడు. "దిగి వస్తావా నన్నే అక్కడికి రమ్మంటావా?" గర్జించాడాయన. వాడు వణుకుతూనే క్రిందికి వచ్చేడు. వాడ్ని రెండు తన్నాడాయన.

"పో వెధవా. ఈ కాకిపిల్లల్ని ఎప్పటిలా గూళ్ళల్లో పెట్టు—" ఆజ్ఞాపించాడాయన.

వాడా రెండు పిట్టల్నీ తీసుకుపోయి వాటిని యథాస్థానాల్లో ఉంచి దిగివచ్చాడు.

"ఇక పోండి. వెధవ నాయాళ్ళారా! ఇక ఈ ప్రాంతాల్లో కనిపించారంటే చంపే స్తాను. పారిపోండి" గాండ్రించాడా పెద్ద మనిషి.

దెబ్బలు తిన్నవాడు తన మిత్రుణ్ణి ఆసరాగా తీసుకున్నాడు. చావుతప్పి కన్ను లొట్టపోయినట్టు విషాదంగా కదిలారా అబ్బులు!

ఆ పెద్ద మనిషి ప్రేక్షకుల వంకా, పక్షుల వంకా ఒక సారి చూశాడు. పక్షుల్ని రక్షించానన్న సంతృప్తి ఆయన మొహంపై కనుపించింది.

"దొంగవెధవలు! నేనులేకపోతే ఇవాళ రెండు కూనల్ని చంపేసేవాళ్ళే" అని గర్వంగా చూస్తూ, ప్రక్కనే ఉన్న మిలిటరీ భోజన హోటల్‌లోకి వెళ్ళాడాయన!

నా గుండెల్లో అగ్ని పర్వతాలు ప్రజ్వరిల్లాయి. వాళ్ళిద్దరూ పరాజితులై పారిపో తున్నారు. నేను గబగబా నడిచి వాళ్ళను చేరుకున్నాను.


"ఒరే ఆ కాకి పిల్లల్నెందుకు కొట్టారు?" లాలింపుగా అడిగాను. దుఃఖంలో ఉన్న వార్ని ఓదార్చుతుంటే వాళ్ళ ఏడుపు కట్టలు తెంచుకుని పొంగు తోంది. నా అనునయ వాక్యాలకు బావురు మని ఏడ్చారు వాళ్ళు. ఏడుస్తూనే చెప్పారు:

"ఏటి సెప్పమందురు బాబుగారూ? మాయదారి వాన మమ్మల్ని మోసంసేసింది పైరు లెండిపోనాయి. కరువొచ్చి మా బతుకుల్ని మసిసేసినాది. రైతులే తిండి నేక అల్లాడుతున్నారు. కట్టంసేత్తా బతికే వాల్లం మా గతింకెలాగుంటాది? కట్టం సేసుకోడానికి పనుల్లేవు. కూలికి పిలిసే వారెవరూలేరు. అడుక్కున్నా దర్మంచేసే అయ్యల్లేరు. ఇంత పెద్ద పట్నంలోనూ మాకు పని దొరకనేదు, మా నాటి వాల్లెంత మంది నేరు! .... మూడు రోజుల్నుంచీ తిండి నేదు. ఇకేటి సెయ్యమంటారు? ఆకలి కాగనేక పిట్టల్ని పట్టుకున్నాము. మేవూ తిండి తినే మనుసులమే. ఐనా గతి నేక కడుపు కోసం కాకుల్ని తినడానికి సిద్దపడ్డాం. మా కన్నా వారికి ఆ కాకిపిల్లలే ఎక్కువైనాయి మహా పెబో! మమ్మల్నింత గోరంగా హింసించారండో!...." అంటూ గోడుగోడున ఏడవసాగారు.

నా గుండెలోచేయిపెట్టి కెలికినట్లయింది. ఆవేదనతో అలమటించాను నేను.

ఈ పరిస్థితిని బుద్ధుడు చూస్తే ఏంచేసే వాడు?

జీసస్ చూస్తే ఏం పలికేవాడు?



"నన్ను చూడు నా అందం చూడు!" ఫోటో: వి. రామచంద్రమూర్తి, గుంటూరు-2

గాంధీ చూస్తే ఏంచెప్పేవాడు?

వీళ్ళలో తప్పుందని చెప్తారా? ప్రాణాల్ని దక్కించుకోడం కోసం కాకి పిల్లల్ని చంపటం తప్పంటారా?

నా దృష్టిలో పక్షుల్ని హింసించడం మంచిదికాదు. కాని పక్షికన్నా మనిషి ఎక్కువ నాకు.

ఆ పెద్దమనిషి చేసిందేమిటి? వీళ్ళు పక్షుల్ని హింసిస్తున్నారని వీళ్ళని హింసించి మిలిటరీ భోజన హోటల్‌లో దూరాడు. తను తినే మాంసాహారమూ ఈ హింస వల్లనే వస్తుందని అతనికి తెలీదా? కాక పోతే తానా హింసని కళ్ళారా చూడడేమో. వీళ్ళు ప్రత్యక్షంగా హింసించారు. పొట్ట కూటికోసం పనికిరాని పక్షుల్ని చంపటం తప్పా? హింసా??

భయంకరమైన వేదనతో మెలితిరిగి పోయాను. నాలో తుఫాను!

తుఫాన్‌లో నేను!

జేబులో చెయ్యిపెట్టాను. పర్సులోని డబ్బంతా తీశాను. పదమూడు రూపాయల పైన కొంచెం చిల్లర ఉంది. ఆ డబ్బంతా వాళ్ళ చేతుల్లో పోసి గబగబా పెద్ద పెద్ద అంగలువేస్తూ సాగిపోయాను నేను.

నాకు తెలుసు. నేనిచ్చిన డబ్బు వాళ్ళ రెండు కుటుంబాల కరవునీ మూడురోజుల కంటే ఎక్కువ తీర్చలేదని. ఆ మూడు రోజుల తర్వాత మళ్ళీ మామూలేనేమో! వాళ్ళ బ్రతుకులకు హింసఅనివార్యమేమో!

★